సాక్షి
వికారాబాద్
సోమవారం : 30 : జూన్ : 2025



తాగునీటికి తండ్లాట!
ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామన్న ప్రభుత్వ పెద్దల మాటలు నీటి మీది రాతలుగా మారాయి. 8లో▸



సాగుకు సాయం..
వానాకాలం పంట సాగు సమయంలో పెట్టుబడి సాయం అందడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. 8లో▸



రైతుల కోసం!
సాగు మెలకువలు, రైతుల సందేహాలు నివృత్తి చేసేందుకు ప్రభుత్వం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. 9లో▸

న్యూస్‌రీల్

ఆర్టీసీ టూర్ ప్యాకేజీకి విశేష స్పందన

అనంతగిరి: ఆలయాల సందర్శనకు ఆర్టీసీ ప్రవేశపెట్టిన టూర్ ప్యాకేజీకి విశేష స్పందన లభిస్తుందని వికారాబాద్ డీఎం అరుణ అన్నారు. ఈ ప్యాకేజీలో 64 మంది ప్రయాణికులు ఈ నెల 27న ధర్మపురి ఆలయాల సందర్శనకు బయలుదేరారని చెప్పారు. వికారాబాద్, హైదరాబాద్, వేములవాడ, కొండగట్టు, ధర్మపురి ఆలయాల దర్శనానికి ప్రత్యేక ప్యాకేజీలతో రెండు బస్సులు నడిపినట్లు ఆమె తెలిపారు. అరుణాచలం, మంత్రాలయం, భద్రాచలం, పంచారామాలు వివిధ ప్రత్యేక ప్యాకేజీలతో బస్సులు నడుతున్నామని పరిసర ప్రాంత ప్రజలందతా సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కనీసం 30–40 మంది ప్రయాణికులు ముందుకు వస్తే నేరుగా వారి కాలనీ వద్దకే బస్సు పంపుతామని చెప్పారు. వివరాలకు 99592 26252 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో మృత్యుంజయ హోమం

నేడు కర్ణాటక మాజీ మంత్రి లింబావళి రాక



తాండూరు రూరల్: మండల పరిధిలోని కొత్లాపూర్ శివారులోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. మూడు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు హోమాలు నిర్వహించనున్నారు. సోమవారం కర్ణాటక మాజీ మంత్రి అరవింద్ లింబావళి తమ ఇంటి దేవత కొత్లాపూర్ రేణుక ఎల్లమ్మ ఆలయానికి విచ్చేయనున్నారు. ఆలయానికి దోషం ఉందని చెప్పడంతో కేరళ నుంచి తొమ్మిది మంది పూజారులతో మృత్యుంజయ హోమం నిర్వహించనున్నారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ నవీన్ రెడ్డి, డైరక్టర్లు రాజు, లాలయ్యగౌడ్, శాంతప్ప, లాల్యా నాయక్, ఈశ్వరమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్య, ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి



మాట్లాడుతున్న ఏవీఎన్ రెడ్డి

పరిగి: విద్య, ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడుతామని హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని తపస్ కార్యాలయంలో జిల్లా నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ప్రతీ ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలున్నా తమదృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రతీ పాఠశాలలో తాగునీటి వసతి కల్పిస్తామన్నారు. ఉపాధ్యాయుల నుంచి వస్తున్న మల్టీ జోన్–2లో ఖాళీగా ఉన్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీఆర్ఎం దక్షిణ మధ్య క్షేత్రప్రముఖ్ విష్ణువర్ధన్‌రెడ్డి, మండల విద్యాధికారి గోపాల్, రమేశ్‌యాదవ్, లక్ష్మయ్య, సాయిబాబ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పరిగి: కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లు రద్దు చేసేందుకు యత్నిస్తున్న ప్రయత్నాన్ని విరమించుకోవాలనే డిమాండ్‌తో జూలై 9వ తేదీన నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం పట్టణ కేంద్రంలో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మికులపై కక్షసాధింపులకు పాల్పడుతోందన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ దేశ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు.

టీబీకి టాటా



అవగాహనతో వ్యాధి దూరం
- క్షయ కట్టడికి టీబీ ముక్త్ భారత్ అభియాన్ శిబిరాలు
- కొత్త కేసులు నమోదు కాకుండా చర్యలు
- వ్యాధి నివారణపై బాధితులకు సూచనలు

కొడంగల్ రూరల్: క్షయ కట్టడికి జిల్లా అధికారులు చేపడుతున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు బాధితులను గుర్తిస్తూ మందులు పంపిణీ చేస్తూ టీబీ నివారణకు కృషిచేస్తున్నారు. మరోవైపు క్షేత్రస్థాయిలో వ్యాధిని గుర్తిస్తూ చికిత్స విధానాలపై అవగాహన కల్పిస్తూ కొత్త కేసులు నమోదు కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. టీబీ సోకినవారు ఆందోళన చెందకుండా ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా మందులు వాడాలని.. ఇతరులకు వ్యాధి సోకకుండా జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

సరైన సమయంలో చికిత్స అవసరం

క్షయ నివారణకు వైద్యుల సూచనలు పాటిస్తూ సరైన చికిత్స తీసుకోవాలి. ఇది మనిషిని బలహీన పరుస్తుందని.. ఇది అంటు వ్యాధి అయినందున జాగ్రత్తలు పాటించాలి. క్రమం తప్పకుండా మందులు తీసుకుంటే వ్యాధిని కట్టడి చేయొచ్చని సూచిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు వ్యాధిగ్రస్తులకు ఎప్పటికప్పుడు మందులు ఇస్తూ నివారణ చర్యలు తీసుకుంటున్నారు.



మెట్లకుంటలో వైద్యశిబిరం(ఫైల్)

నిబంధనలు తప్పనిసరి

ప్రైవేటు ఆస్పత్రుల్లో క్షయ బాధితులను గుర్తిస్తే వారి వివరాలను జిల్లా క్షయ నియంత్రణ శాఖకు సమాచారం ఇవ్వాలి. బాధితుడికి ఆరు నెలలపాటు చికిత్స అందించాలి. బాధిత కుటుంబసభ్యులు, ప్రైవేటు ఆస్పత్రుల సిబ్బంది, వ్యాధి సోకిన వ్యక్తులు ప్రతీ ఒక్కరి సమష్టి కృషితోనే వ్యాధి నివారణ సాధ్యమవుతుంది.

వ్యాధి గుర్తింపు

రెండు వారాలకు మించి ఎడతెరిపి లేకుండా దగ్గు, సాయంత్రం జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, చాతిలో నొప్పి తదితర లక్షణాలుంటే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాలి. ఉచితంగా తెమడ పరీక్షలు చేసి వ్యాధిని గుర్తిస్తారు. ఈ వ్యాధి ఊపిరితిత్తులపై ఎక్కువగా ప్రభావం చూపుతుంది. పొగ తాగేవారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.

శిబిరాలను వినియోగించుకోవాలి

వైద్య శిబిరాల్లో డయాబెటిస్, డయాలసిస్, 60 ఏళ్ల పైబడిన వృద్ధులు, బీపీ, షుగర్, పాత టీబీ వ్యాధిగ్రస్తులు, ప్రస్తుతం లక్షణాలు కనిపించే వ్యక్తులు, హెచ్ఐవీ తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహిస్తూ ఉచితంగా మందులను అందిస్తున్నారు. జిల్లాలోని మర్పల్లి, వికారాబాద్, పరిగి, కొడంగల్, తాండూరు ఆస్పత్రుల పరిధిలోని సబ్ సెంటర్లలోని గ్రామాల్లో సోమ, మంగళ, బుధ, శుక్రవారం వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు.



సమష్టి కృషితో నివారణ

వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడాలి. ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు టీబీకి సంబంధించి ఏ ఒక్క లక్షణం కనిపించినా వ్యాధిగ్రస్తులను ప్రభుత్వ ఆస్పత్రులకు పంపించాలి. ప్రైవేటు ఆస్పత్రుల, ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు, వ్యాధిగ్రస్తులు, వ్యాధిగ్రస్తుల కుటుంబసభ్యులు సమష్టిగా, బాధ్యతగా వ్యవహరిస్తూ టీబీ నియంత్రణకు కృషిచేయాలి. వ్యాధి నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ రవీంద్రయాదవ్, జిల్లా క్షయ నియంత్రణ అధికారి

రెండేళ్లకోసారి..

శ్రీవారి పవిత్రోత్సవాలు
- జూలై 19 నుంచి టీటీడీ తరహాలో నిర్వహణ
- పోస్టర్ ఆవిష్కరించిన ఆలయ కమిటీ సభ్యులు



శ్రీవారి మూల విరాట్

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన పట్టణంలోని మహాలక్ష్మీ సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో జులై 19వ తేదీ నుంచి పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆదివారం ఆలయ ధర్మకర్తలు భక్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. పవిత్రోత్సవాల నిర్వహణపై చర్చించారు. ప్రతి ఒక్కరూ భగవంతుని కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ధర్మకర్తలు కోరారు. ఆలయ పవిత్రతతో పాటు పట్టణ పురోగతి కోసం పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కొడంగల్ శ్రీవారి ఆలయంలో రెండేళ్లకు ఒకసారి ఈ పవిత్రోత్సవాలు జరుగుతాయని వివరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులతో పాటు ఆలయ అర్చకులు పాల్గొని ఉత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తారని తెలిపారు. శ్రీవారి ఆలయంలో నిత్యం జరిగే కైంకర్యాలు, ధూప దీప నివేదనలో ఏమైనా పొరపాటు జరిగితే మంత్ర లోపము, ద్రవ్యలోపము, క్రియా లోపము వలన కలుగు దోషములకు నివారణ కలుగుతుందన్నారు. లోక కల్యాణంతోపాటు విశ్వశాంతి కలుగుతుందన్నారు. జూలై 22న ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న ధర్మకర్తలు, భక్తులు



సంఘీభావం ప్రకటిస్తున్న వీడీడీఎఫ్ ప్రతినిధులు

జిల్లా అభివృద్ధికి కార్యాచరణ

- వీడీడీఎఫ్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం
- సమస్యలపై చర్చ

అనంతగిరి: జిల్లా సమగ్రాభివృద్ధికి అంశాల వారీగా సమస్యలను తీసుకుని జిల్లా ప్రజాప్రతినిధులకు, అధికారులకు నివేదించాలని.. వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని వీడీడీఎఫ్ (వికారాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ఫోరం) సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆదివారం వికారాబాద్‌లోని సంకల్ప విద్యాపీఠం ఆడిటోరియంలో జిల్లా అభివృద్ధిపై రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీడీడీఎఫ్ అధ్యక్షుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. రీజినల్ రింగ్ రోడ్డును కనెక్ట్ చేస్తూ వికారాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు, పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా, బీజేఆర్ చౌరస్తా, ఎంఎస్‌టీ చౌరస్తాల విస్తరణ, ప్రస్తుతం ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని కొద్దిగా హైదరాబాద్ రోడ్డువైపు జరిపి చౌరస్తా అందంగా తీర్చిదిద్దాలని, సిగ్నల్ వ్యవస్థను పునురుద్ధరించి సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్‌హెచ్–163 విస్తరణ పనులకు డిమాండ్

ఫోరం వ్యవస్థాపక సభ్యుడు, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభ ప్రద్ పటేల్ మాట్లాడుతూ.. మన్నెగూడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్–163) విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు వెంకటరత్నం, శ్రీశైలం మాట్లాడుతూ.. జిల్లా ప్రజల చిరకాల స్వప్నం గ్రామీణ విశ్వవిద్యాలయం, కేంద్రీయ విద్యాలయం, నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. వ్యాపార వర్గాల తరఫున కె.విజయ్‌కుమార్ మాట్లాడుతూ అనంతగిరి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయవాదులు అశోక్, ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఫోరం ప్రతినిధులు దేవదాస్,మాణిక్ రెడ్డి, మారుతి, ఫక్రుద్దీన్ లు మాట్లాడుతూ.. అనంతగిరి, రామయ్యగూడ, గంగారం మార్గాలలో రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలన్నారు. పరిగి నియోజకవర్గ ప్రతినిధి నగేశ్, రాము మాట్లాడుతూ యువతకు నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ లెక్చరర్ ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతిరెడ్డి, మహేశ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్థలు అన్నింటికి సొంతభవనాలు నిర్మించాలని కోరారు. సమావేశంలో ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులు సుధాకర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఉద్యోగ సంఘాల నుంచి నంద కుమార్, మహిళా సంఘాల నుంచి గీతా, జర్నలిస్టుల తరఫున షఫీ, రామచందర్, సామాజిక కార్యకర్త శ్రీను, శాంత్ కుమార్, దళిత సంఘాల నాయకులు పి.అనంతయ్య, అధ్యాపకులు జగన్నాధం తదితరులు పాల్గొన్నారు.

తేలేదెప్పుడో..?

- కొలిక్కిరాని ఎనికేపల్లి భూముల వ్యవహారం
- ఎన్నిసార్లు చర్చలు జరిగినా తేలని పరిహారం
- రెండుసార్లు సర్వే చేయకుండానే వెనుదిరిగిన అధికారులు
- కొనసాగుతున్న పోలీస్ పహారా

మొయినాబాద్: ఎనికేపల్లి భూముల వ్యవహారం ఎటూ తేలడంలేదు. పరిహారం విషయంలో అటు అధికారులు, ఇటు రైతులు పట్టు వీడడంలేదు. ఇప్పటికే పలు దఫాలుగా అధికారులు రైతులతో చర్చలు జరిపారు. పరిహారం విషయంలో ఎవరూ వెనక్కి తగ్గకపోవడంతో నెల రోజులుగా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు.

రెవెన్యూ రికార్డుల్లో సర్కారు భూమి

ఎనికేపల్లి సర్వేనంబర్ 180లోని 99.14 ఎకరాలు 1954 నుంచి రెవెన్యూ రికార్డుల్లో సర్కారి భూమిగానే నమోదవుతూ వస్తోంది. 1954లో ఈ భూమిని హరిజనులు సాగుచేసుకోవడానికి ఇచ్చినట్లు రెవెన్యూ రికార్డుల్లో ఉంది. కొన్నేళ్ల పాటు రైతుల పేరు కబ్జా కాలంలో వచ్చాయి తప్ప అసైనీలుగా పేర్కొనలేదు. రెవెన్యూ రికార్డుల్లో పూర్తిగా సర్కారు భూమిగా కొనసాగుతూ వచ్చింది. గ్రామానికి చెందిన సుమారు 50 మంది రైతులు డెబ్బై ఏళ్లుగా ఇక్కడ సాగుచేసుకుంటున్నారు. ఈ భూములను ప్రభుత్వం ఇటీవల గోశాల ఏర్పాటుకు కేటాయించింది. విషయం తెలిసిన గ్రామస్తులు నెల రోజుల నుంచి ఆందోళన మొదలు పెట్టారు. ఈ భూములనే నమ్ముకుని జీవిస్తున్నామని, తమకే అసైన్డ్ చేయాలని డిమాండ్ చేశారు. పలు రాజకీయ పార్టీల నేతలు సైతం భూములను పరిశీలించి రైతులకు మద్దతుగా ఉంటామని ప్రకటించారు.

చర్చలు విఫలం

భూములు సాగుచేసుకుంటున్న రైతులతో రెవెన్యూ అధికారులు పలుమార్లు చర్చలు జరిపారు. చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ, మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్ పరిహారం విషయంపై వారితో చర్చించారు. ఎకరాకు వెయ్యి గజాల చొప్పున పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎకరాకు 200 గజాల చొప్పున ఇస్తామని అధికారులు తేల్చి చెప్పారు. మూడుసార్లు జరిపిన చర్చలు విఫలం అయ్యాయి.

ఎమ్మెల్యేపై భారం వేసిన రైతులు

పరిహారం విషయంలో రైతులు ఎమ్మెల్యే కాలె యాదయ్యపై భారం వేశారు. పలుమార్లు ఆయనను కలిసి ప్రభుత్వంతో చర్చించి మంచి పరిహారం ఇప్పించాలని కోరారు. రైతులను తీసుకుని కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే పరిహారం విషయంపై చర్చించారు. ఎకరాకు 800 గజాలు పరిహారంగా ఇవ్వాలని ఎమ్మెల్యే కోరగా 250 గజాలు ఇస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. కనీసం ఎకరాకు 400 గజాలైనా ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. ఈ విషయమై శనివారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి చర్చించారు. ఎకరాకు 350 గజాల స్థలం ఇచ్చేందుకు సీఎం సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ పరిహారంపై కొందరు రైతులు సంతృప్తిగానే ఉన్నట్లు సమాచారం.

రెండు సార్లు సర్వే చేయకుండానే..

గోశాలకు కేటాయించిన భూములను సర్వే చేసేందుకు హెచ్ఎండీఏ అధికారులు రెండుసార్లు వచ్చారు. పరిహారం విషయం తేలకపోవడంతో సర్వే చేయకుండానే వెనుదిరిగారు. మరోవైపు ఎనికేపల్లి భూముల వద్ద పోలీస్ పహారా కొనసాగుతోంది. కొత్త వ్యక్తులు, రైతులను అటువైపు రాకుండా కాపలా కాస్తున్నారు.



ఎనికేపల్లిలో గోశాలకు కేటాయించిన భూమి

మా బతుకులు ఏం కావాలి



తాతల కాలం నుంచి సాగుచేసుకుంటున్నాం. ప్రభుత్వం ఇప్పుడు గోశాలకు ఇస్తే మా బతుకులు ఏం కావాలి. 1954 నుంచి 1998 వరకు పహణీల్లో మా పేర్లు వచ్చాయి. తరువాత సర్కారు భూమి అని వచ్చింది. మోకిలలో ఇచ్చినట్లు ఎకరాకు 750 గజాల చొప్పున పరిహారం ఇస్తే మంచిది.

– న్యాలట మహిపాల్, రైతు, ఎనికేపల్లి

ప్రభుత్వమే ఆదుకోవాలి



సాగుచేసుకుంటున్న భూములు తీసుకుంటే మా బతుకులు ఆగమైతయి. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి. ఎంత పరిహారం ఇస్తామన్న విషయం అధికారులు సరిగా చెప్పడంలేదు. ఎమ్మెల్యేపైనే భారం పెట్టాం. ఆయన ముఖ్యమంత్రితో మాట్లాడి పరిహారం ఇప్పిస్తామని చెప్పారు.

– అనుసూయ, మహిళా రైతు, ఎనికేపల్లి

రహదారి.. ప్రతిపాదనలతోనే సరి



పరిగి మున్సిపల్‌లో కొడంగల్ చౌరస్తా నుంచి వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు దుస్థితి

అధ్వానంగా అంతర్గత రోడ్లు
- చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతున్న వైనం
- వాహనదారులకు నరకయాతన
- పట్టించుకోని ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖలు
- కొత్తరోడ్లు మంజూరయ్యాయంటూ దాటవేస్తున్న అధికారులు

వికారాబాద్: గతంలో కురిసిన వర్షాలకు పాడైన రోడ్లు చిన్నపాటి వర్షం కురిసినా చిత్తడిగా మారుతున్నాయి. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, మున్సిపల్ అనే తేడా లేకుండా రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. అధికారులను ప్రశ్నిస్తే ప్రతిపాదనలు పంపామంటూ చేతులు దులుపుకొంటున్నారు తప్ప కనీస మరమ్మతులు కూడా చేపట్టడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. వర్షాలు కురిసిన ప్రతీసారి దెబ్బతిన్న రోడ్ల వివరాలు సేకరించామంటున్నారే తప్పితే ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నా పట్టించుకున్న పాపాన పోవడం లేదు.

టెండర్లకే పరిమితమైన మరమ్మతులు

జిల్లాలో గతేడాది కురిసిన వర్షాలకు పాడైన ఆర్అండ్‌బీ రోడ్లకు సంబంధించి ఆ శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపారు. అధికారుల సర్వేలో జిల్లా వ్యాప్తంగా 198 కిలోమీటర్ల మేర రోడ్లు పాడైనట్లు తేలింది. వీటిని పూర్తి స్థాయిలో పర్మినెంట్‌గా బాగు చేసేందుకు రూ.89 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.8కోట్ల నిధులు అవసరమవుతాయని ప్రతిపాదనల్లో ప్రస్తావించారు. ఇందులో ఆర్అండ్‌బీ శాఖ 98 కిలోమీర్ల మేర రోడ్ల మరమ్మతులకు రూ.39 కోట్లు, పంచాయతీ రాజ్ నుంచి రూ. 20 కోట్లు మంజూరయ్యాయి. అయితే ఈ రెండు శాఖల్లోనూ పాడైన రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు, రోడ్లు మంజూరు, టెండర్ల ప్రక్రియ దగ్గరే నిలిచిపోయింది.

మెజార్టీ రోడ్లన్నీ అంతే

జిల్లాలో ఒకటి రెండు రోడ్లు మినహా మెజారిటీ రోడ్లు అధ్వానంగా మారాయి. వికారాబాద్–పరిగి, వికారాబాద్–నవాబుపేట, వికారాబాద్–బుగ్గదేవాలయం వేళ్లే దారి, వికారాబాద్–తాండూరు రహదారి, కొడంగల్–తాండూరు, కొడంగల్–మహబూబ్‌నగర్, పరిగి–మిట్టకోడూర్, దోమ మండల పరిధిలోని దోర్నాల్‌పల్లి–గొడుగోనిపల్లి , ఐనాపూర్–పాలెపల్లి, గడిసింగాపూర్–మల్లెపల్లి, వికారాబాద్–సదాశివాపేట్, కోటాలగూడ–లాల్‌సింగ్‌తండా, మన్నెగూడ–మిర్జాపూర్ మీదుగా లాల్‌సింగ్ తండా, వికారాబాద్–దామగుండ తదితర రోడ్లన్నీ ప్రయాణానికి ఇబ్బందిగా మారాయి.



క్లుప్తంగా

శిథిలావస్థకు చెరువు తూము



మరమ్మతుకు గురైన ఆలేడ్ చెరువు తూము

దుద్యాల్: మండలంలోని ఆలేడ్ గ్రామంలో ఉన్న తూము లీకేజీ కావడంతో చెరువులో ఉన్న నీరు వృథాగా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది పూర్తిస్థాయి నీటి మట్టం నిండుకుంది. చెరువు తూము లీకేజీ కావడంతో నీరు వృథాగా పోయిందని రైతులు వాపోతున్నారు. తూము నుంచి నీరు బయటకు పోకుండా ఉపయోగించే ఇనుప రాడ్డు పూర్తిగా లోపలికి పడిపోయిందని అన్నదాతలు పేర్కొంటున్నారు. చెరువు తూము లీకేజీ అవుతున్నా ఇప్పటివరకు ఏ అధికారి కూడా పరిశీలించిన దాఖలాలు లేవు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి తూముకు మరమ్మతులు చేయాలని వ్యవసాయదారులు కోరుతున్నారు.

యువత వ్యసనాల బారిన పడొద్దు

గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు



మాట్లాడుతున్న సీఐ కృష్ణంరాజు

యాచారం: యువత చెడు అలవాట్లకు గురై జీవితాలను నాశనం చేసుకోవద్దని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు సూచించారు. పీఎస్ పరిధిలోని కుర్మిద్ద గ్రామంలో ఆదివారం సాయంత్రం గంజాయి, డ్రగ్స్ నియంత్రణ, రోడ్డు నిబంధనలు, ఘర్షణల వల్ల జీవితాల నాశనం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు యువతసేనని, అలాంటి వారు వ్యసనాలకు గురై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గొప్ప లక్ష్యంతో యువత ఆసక్తి కలిగిన రంగాల్లో రాణించాలని సూచించారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో కేసులు నమోదుతో పాటు జరిమానాలు విధిస్తామన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, బంధువుల ఇళ్లకు, శుభ కార్యాలకు వెళ్లేటప్పుడు విలువైన వస్తువులు, బంగారు నగలను ఇంట్లో ఉంచి వెళ్లరాదని సూచించారు. సమావేశంలో రాచకొండ సీఐ జోసఫ్, ఎస్ఐ తేజంరెడ్డి పాల్గొన్నారు.

అర్ధరాత్రి విహరిస్తే కఠిన చర్యలు

మీర్‌పేట సీఐ నాగరాజు

మీర్‌పేట: వేడుకలు, ఇతర కారణాలతో అనవసరంగా అర్ధరాత్రి రోడ్లపైకి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మీర్‌పేట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు యువతను హెచ్చరించారు. శనివారం అర్ధరాత్రి తరువాత స్టేషన్ పరిధి నందనవనం, ఆర్ఎన్‌రెడ్డినగర్, భూపేష్‌గుప్తానగర్‌లలో పోలీసులు ఆపరేషన్ చబుత్ర చేపట్టారు. ఈ సందర్భంగా రాత్రిళ్లు రోడ్లపై తిరుగుతున్న 122 మంది యువకులను గుర్తించారు. జన్మదిన వేడుకల పేరుతో కాలనీ కూడళ్లు, ప్రధాన రహదారులపైకి రావడం, అదే విధంగా రాత్రంతా బాక్స్ టైపు క్రికెట్ ఆడుతూ ఇతరులను ఇబ్బందులకు గురి చేయవద్దని ఇన్‌స్పెక్టర్ సూచించారు. ఏ కారణం లేకున్నా యువత రోడ్లపై ద్విచక్ర వాహనాలను విచ్చలవిడిగా నడపడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకోవడంతో పాటు గొడవలకు కారణమవుతాయని అవగాహన కల్పించారు. ఆపరేషన్ చబుత్రలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ గౌరునాయుడు, ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

12న ఐటీ ఉద్యోగులకు అవగాహన

రాయదుర్గం: ఐటీ ఉద్యోగుల కోసం గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో జూలై 12వ తేదీన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. శాంతిసరోవర్ క్యాంపస్‌లోని ఇన్నర్‌స్పేస్‌లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం సాగుతుంది. ఈ సందర్భంగా 'ఇన్నర్ ఎక్స్‌లెన్స్ రీట్రీట్' పేరిట 'ఒత్తిడి లేని జీవితాన్ని గడపడానికి మనస్సును పున:ప్రారంభించడం'పై ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం ముత్తుట్, మార్వాడి షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9389214214
(H-783418)

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తాగునీటికి తండ్లాట!



వ్యవసాయ బోరు వద్ద నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న కాలనీవాసులు



మోటారు తీసుకుపోవడంతో పడి ఉన్న వైర్లు

- 15 రోజులుగా తీవ్ర అవస్థలు
- వ్యవసాయ బోర్లను ఆశ్రయించిన వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- మీనపల్లికలాన్ ఎస్సీకాలనీ దుస్థితి

నవాబుపేట: ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామన్న ప్రభుత్వ పెద్దల మాటలు నీటి మీది రాతలుగా మారాయి. అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ నీటి సరఫరా కొనసాగుతుంటే ఆ ఊరిలో మాత్రం అలాంటి సదుపాయం లేదు. కేవలం బోరు మోటారుతో తమ అవసరాలను తీర్చుకుంటున్న పరిస్థితి. అది కూడా కాలిపోయి 15 రోజులు అవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోతున్నారు. ఇదీ మండల పరిధిలోని మీనపల్లికలాన్ గ్రామం ఎస్సీ కాలనీలోని దుస్థితి.

మిషన్ భగీరథ పైపులైన్ లేదు

కాలనీలో దాదాపు 80కిపైగా కుటుంబాలుంటాయి. కానీ ఇప్పటివరకు మిషన్ భగీరథ పైపు లైన్ వేయలేదు. ఒక్క ఇంటికి సైతంకుళాయి కనెక్షన్ బిగించిన పాపాన పోలేదు. గతంలో చేసిన పనులకుగాను కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో మధ్యలో వదిలేసినట్లు సమాచారం. దీంతో అప్పటికే ఉన్న ప్రభుత్వ బోరు మోటార్‌తో మాత్రమే కాలనీవాసులు తమ అవసరాలను తీర్చుకుంటూ వస్తున్నారు. గత 15 రోజులు క్రితం ఉన్న కాస్త మోటారు కాలిపోయింది. స్థానికుల ఫిర్యాదు మేరకు పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి బోరు మోటారును బాగు చేయిస్తామని తీసుకుపోయారు. కానీ ఇంతవరకు తిరిగి తీసుకు రాలేదు. దీంతో కాలనీలో నీళ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు కార్యదర్శిని సంప్రదిస్తే బోరుమోటారు పూర్తిగా కాలిపోయిందని, కొత్తది కొనడానికి డబ్బులు లేవని చెప్పారు. ఈ సమస్యను ఉన్నతాధికారులకు చెప్పామన్నారు. డబ్బులు రాగానే నూతన బోరుమోటారు తీసుకువస్తామని తెలిపినట్లు గ్రామస్తులు వివరించారు.

సమస్యను పరిష్కరిస్తా

ఈ విషయమై గ్రామ ప్రత్యేకాధికారి బుచ్చయ్య(తహసీల్దార్) వివరణ కోరగా.. గ్రామంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య ఉందని ఇటీవలే తన దృష్టికి వచ్చిందన్నారు. సోమవారం తాను స్వయంగా వెళ్లి మోటారు బిగించి తాగునీటి సమస్య పరిష్కరిస్తానని తెలిపారు.

సాగుకు సాయం.. రైతు మురిపెం



దౌల్తాబాద్‌లో వ్యవసాయ పనులు చేస్తున్న రైతు

భరోసా నిధులతో వ్యవసాయ పనులకు ఊతం

దౌల్తాబాద్: వానాకాలం పంట సాగు సమయంలో ఎకరాకు రూ.6 వేల చొప్పున పెట్టుబడి సాయం అందడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. ఈ సీజన్‌కు అమలు చేస్తున్న రైతు భరోసా పథకంతో పంటల సాగుకు ధీమా లభించింది. యాసంగి సాగులో ఈ పథకానికి పరిమితి విధించగా ఈ సారి ఎత్తివేసింది. వానాకాలం పెట్టుబడి సాయంగా రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులు తొమ్మిది రోజుల్లో జమ చేసింది. తొలిరోజు ఎకరా నుంచి మొదలు ఇప్పటివరకు పూర్తి స్థాయిలో ఖాతాల్లో నిధులు జమ అయ్యాయి. దుక్కులు సిద్ధం చేసుకుని ఎరువులు విత్తనాలు కొనేందుకు ఎదురు చూస్తున్న సమయంలో సకాలంలో రైతు భరోసా నిధులు విడుదల కావడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్న సమయంలో సాయం డబ్బులు జమ కావడంతో రైతులకు ప్రయోజనం చేకూరింది.

సాగు ప్రారంభంలోనే...

వానాకాలం సాగు పనులు ఇప్పుడిప్పుడే జోరందుకున్నాయి. చాలా చోట్ల పత్తి విత్తనాలు విత్తగా కొన్ని చోట్ల కలుపులు తీస్తున్నారు. ఇప్పటివరకు సరైన వర్షాలు లేకపోవడంతో వరి సాగు పనులు ఆలస్యమవుతున్నాయి. సాగు ప్రారంభంలోనే ఎదురు చూడకుండానే పెట్టుబడికి సాయం నిధులు అందడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. కొడంగల్ డివిజన్ పరిధిలో ఇప్పటివరకు 56,459 మంది రైతులకుగాను రూ.70.59 కోట్ల నిధులు జమ అయ్యాయని అధికారులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

శంషాబాద్ రూరల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఊటపల్లిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. క్యాబ్ డ్రైవర్ మొహమ్మద్ పరాజ్‌ఖాన్(23) ఊటపల్లి శివారులో నివాసమంటున్నాడు. ఇతను కొందరి నుంచి, ఆర్థిక కార్యాలయాల నుంచి అప్పు తీసుకున్నాడు. తిరిగి వీటిని చెల్లించలేకపోయాడు. ఈ క్రమంలో ఈ నెల 28న రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు అతన్ని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాలనీకి సిందూర్ పేరు పెట్టడం అభినందనీయం

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడ వాంబేకాలనీలో నూతనంగా నిర్మించబడిన కాలనీకి సిందూర్ కాలనీగా ఆవిష్కరణ చేశారు. ఆదివారం రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పాక్ పై భారత్ ఆపరేషన్ సిందూర్ పేరుతో విజయకేతనం ఎగిరేసి దేశ ప్రజల మన్ననలు పొందిన నరేంద్రమోదీపై అభిమానంతో ఏకంగా కాలనీలోని ప్రతి ఒక్కరూ సిందూర్ పేరును ఖరారు చేసి అభిమానం చాటుకున్న వారిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అడికే జనార్దన్, సుబ్బారెడ్డి, మనీష్, తివారి, మధుసూదన్ రెడ్డి, ఓంప్రకాష్, సంపత్, రత్నాకర్, శంకర్‌రెడ్డి, మహేష్ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి



రక్తదాతకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఉమర్ బామ్ తదితరులు

పహాడీషరీఫ్: తలసేమియా బాధితులను ఆదుకునేందుకు రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని సరూర్‌నగర్ మండల మాజీ వైస్ ఎంపీపీ ఉమర్ బామ్ అన్నారు. మజ్లిస్-ఏ-ఉలమాయే హుఫాజ్ వా దానిశ్వరనే మిల్లత్ ఆధ్వర్యంలో షాహీన్‌నగర్‌లో ఆదివారం ఉచిత రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నెల నెల రక్తమార్పిడి అవసరమయ్యే వారికి రక్తదానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏటా మనదేశంలో 10–12 వేల మంది తలసేమియా పిల్లలు జన్మిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు కూడా తలసేమియాను ప్రజారోగ్య సమస్యగా ప్రకటించాలన్నారు. ఎర్ర రక్తకణాలలో హీమోగ్లోబిన్ లోపం వల్ల ఒక మాదిరి నుంచి తీవ్రమైన రక్తహీనత లక్షణాలు కలిగి, రక్త సంబంధమైన అనువంశిక రుగ్మతే తలసేమియా మేజర్‌గా పేర్కొంటారన్నారు. దాదాపు 390 మంది దాతలు రక్తదానం చేసి తలసేమియా సికిల్ సెల్ సొసైటీకి అందజేశారు. కార్యక్రమంలో హాఫీజ్ అబ్దుల్ హాది, డాక్టర్ ముస్తఫా అలీ సుఫియానీ, సయ్యద్ యూసుఫ్ పటేల్, అబ్దుల్ రవూఫ్, ఎం.ఎ.బారీ, అలీం బేగ్ తదితరులు పాల్గొన్నారు.

పనికి వెళ్లడం లేదని..

తల్లి మందలించడంతో కొడుకు అదృశ్యం

పహాడీషరీఫ్: పనికి వెళ్లడం లేదని తల్లి మందలించడంతో కొడుకు ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి వాదే ముస్తఫా బస్తీకి చెందిన షేక్ సమియుద్దీన్ షరీఫ్ కుమారుడు అకేఫుద్దీన్ షరీఫ్(21) ప్రైవేట్‌గా పని చేస్తుంటాడు. కొన్ని రోజులుగా పనికి పోకపోవడంతో తల్లి ఫర్హానా బేగం ఈ నెల 19వ తేదీన ఉదయం మందలించింది. అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. 21న తిరిగి తల్లి ఫోన్‌కు కాల్ చేసిన షరీఫ్ 'నేను పనికి వెళ్లడం లేదని నన్ను తిడుతున్నారు.. నేను ఎక్కడికైనా వెళ్లిపోతాను' అంటూ కట్ చేశాడు. ఎంతకి అందుబాటులోకి రాకపోవడంతో సాధ్యమైన ప్రాంతాలలో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ విషయమై యువకుడి తల్లి ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇతడి ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో గాని సమాచారం అందించాలని కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు.

అపూర్వ సమ్మేళనం

కొడంగల్ రూరల్: పట్టణంలోని శ్రీ బాలాజీ కేజీ ఉన్నత పాఠశాలలో చదివిన 10వ తరగతి(1999–2000) పూర్వ విద్యార్థులు ఆదివారం ఓ చోటికి కలిసి అప్పటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆహ్లాదంగా గడిపారు. అలనాటి గురువులకు సన్మానం చేస్తూ అప్పటి అనుభవాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటప్ప, ఉపాధ్యాయ సిబ్బంది పద్మ, శరత్కళ, నారాయణ, నర్సింగ్‌నాయక్, పూర్వ విద్యార్థులు రవిచారి, శ్రీనివాస్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



సమేళనంలో గురువులతో విద్యార్థులు



కుట్టు మిషన్‌లను అందజేస్తున్న సేవాసమితి సభ్యులు

ఘనంగా సత్యసాయి శత జయంతి

పరిగి: మండల పరిధిలోని రంగాపూర్ శ్రీ సత్యసాయి సేవా సమితి కేంద్రంలో ఆదివారం శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నామ సంకీర్తనను పుర వీధుల గుండా నిర్వహించారు. ఉత్సవాలల్లో భాగంగా టైలరింగ్ శిక్షణ పొందిన 108 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్‌లను అందజేశారు. అనంతరం సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రావు మాట్లాడుతూ.. శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిత్యం ఏదో ఒక కార్యక్రమాలు నిర్వహిస్తుంటామన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాబా ఆశిస్సులతో నిత్యం ప్రజలకు సేవలను అందిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాహిత్యాన్ని కాపాడుకోవాలి



వివేకానంద కళాశాలలో సాహిత్య-సాంస్కృతిక వేదిక సభ్యులు

అనంత సాహిత్యం-సాంస్కృతిక వేదిక సభ్యులు

చేవెళ్ల: మన కవుల సాహిత్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అనంత సాహిత్యం–సాంస్కృతిక వేదిక వ్యవస్థాపకుడు దోరవేటి చెన్నయ్య, అధ్యక్షుడు తూర్పు మల్లారెడ్డి సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని వివేకానంద కళాశాలలో అనంత సాహిత్యం–సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ మహాకవుల జయంతిని ఘనంగా నిర్వహించుకుని, భావితరాలకు అందించాలన్నారు. అనంతరం సంస్థ నూతన కమిటీని ఎన్నుకున్నారు. వారు ఈ సంవత్సరం నిర్వహించే కార్యక్రమాల క్యాలెండర్‌ను రూపొందించుకున్నట్లు తెలిపారు. జూలై 27న వికారాబాద్‌లో దాశరథి, సి.నారాయణరెడ్డిల జయంతి, చేవెళ్లలో కాళోజీ జయంతి నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆయా శాఖల వారీగా ఉగాది కవి సమ్మేళనాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చేవెళ్ల ప్రాంతం నుంచి అనంత ప్రతినిధులుగా ఘనపురం పరమేశ్వర్, పాపిరెడ్డిలను ఎన్నుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి కడియాల మధుసూదన్, అనంత సాహిత్యం-సాంస్కృతిక వేదిక ప్రధాన కార్యదర్శి కమలేశ్, కార్యదర్శి శ్రీనివాస్, హనుమంత్, సభ్యులు ఆశీర్వాదం, నర్సయ్య, ప్రసాద్, శ్రీనయ్య తదితరులు పాల్గొన్నారు.

కొరత చూపి.. రైతులను దోచేసి

- అధిక ధరలకు ఎరువుల విక్రయాలు
- వానాకాలం సాగులో ఇక్కట్లు



బైరంపల్లిలో విత్తనాలు నాటేందుకు అరక తోలుతున్న రైతు

కొందుర్గు: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో రైతులు పత్తి, మొక్కజొన్న, వరి తదితర పంటల సాగు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందుకోసం ప్రస్తుతం మొదటి దఫా అధికంగా రైతులు డీఏపీ వాడుతారు. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం డీఏపీ బస్తా ధర రూ.1,350 ఉంటే డీలర్లు రూ.1,500 వరకు అన్నదాతలకు విక్రయిస్తున్నారు. అదే విధంగా యూరియా బస్తా ధర రూ.266 ఉండగా రూ.300 పైనే అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోనే కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో అధికంగా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తారు. ఇక్కడ పత్తి, మొక్కజొన్న పంటలను అధికంగా సాగు చేస్తారు. కానీ ప్రస్తుతం డీఏపీ, యూరియా కొరత సృష్టించడంతో తాము అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేసి నష్టపోతున్నామని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై వ్యవసాయాధికారులను వివరణ కోరగా డీఏపీ కొరత ఉన్నది వాస్తవమేనని, వాటి స్థానంలో కాంప్లెక్స్ ఎరువులు వాడాలని సూచిస్తున్నారు. కాగా కాంప్లెక్స్ ఎరువులు మొదటి దఫాలో వాడడంతో పంటలు బాగా పెరిగి చీడపీడలకు గురయ్యే ప్రమాదం ఉంటుందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై ఉక్కుపాదమేది?

- శంషాబాద్‌లో విచ్చలవిడిగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణ
- కంటైనర్ల ఏర్పాటు చేసి దందా చేస్తున్నా చర్యలు శూన్యం
- సాతంరాయిలో యుద్ధప్రాతిపదికన డబ్బాలు తొలగించిన మున్సిపల్ అధికారులు
- పట్టణ ప్రధాన కేంద్రంలో పట్టించుకోని యంత్రాంగం



హైవే ఫుట్‌పాత్‌పై కంటైనర్ వేసి ఏర్పాటు చేసిన హోటల్

శంషాబాద్: 15 రోజుల కిందట సాతంరాయిలోని ఓ గేటెడ్ కమ్యూనిటీకి సమీపంలో రోడ్డుకు ఆనుకుని ఉన్న చిరువ్యాపారాలకు సంబంధించిన డబ్బాలు తొలగించాలని ఉన్నతస్థాయి నుంచి అందిన ఆదేశాలను అధికారులు క్షణాల్లో పూర్తి చేశారు. పక్కాగా పోలీసుల సహకారంతో జేసీబీలను ఏర్పాటు చేసి అక్కడున్న గరీబోళ్ల డబ్బాలను వెంటనే తొలగించి పెద్దసార్ల ఆదేశాలను ఆదేశాలను తూచాతప్పకుండా పూర్తి చేశారు. నాలాను ఆనుకుని ఆక్రమణలున్న కారణంగానే ఫిర్యాదులు అందగానే వాటిని తొలగించినట్లు మున్సిపల్ అధికారులు చెప్పుకొచ్చారు.

మరి ఇక్కడ..?

శంషాబాద్ పట్టణ ప్రధాన కేంద్రంలో ప్రజలకు తీవ్ర ఇబ్బంది కరంగా మారుతున్న ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై మున్సిపల్ అధికారులు ఏడేళ్లుగా ఒక్కటంటే ఒక్కసారి కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. గతంలో అనేక మార్లు ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు కౌన్సిల్‌లో తీర్మానాలు చేసి అవి కార్యాచరణకు నోచుకున్న దాఖలు కూడా లేవు. రోడ్డులను ఆక్రమించి హోటళ్లు, వ్యాపారాలు చేసుకుంటున్నా కన్నెత్తి చూసిన పాపాన పోవడం లేదు.

అద్దెకిచ్చేస్తున్నారు...

ఫుట్‌పాత్‌లను ఆక్రమించి కొందరు సొంత వ్యాపారాలను విస్తరిస్తుండగా మరికొందరు తమ దుకాణాల ముందు చిరువ్యాపారులకు అద్దెకిస్తున్నారు. రోడ్డును అద్దెకిచ్చి ఏళ్లుగా లక్షల రూపాయలు సంపాదిస్తున్న తీరు కూడా ఇక్కడ షరామాములే అన్నట్లుగా మారింది. పట్టణంలోని రాళ్లగూడ రహదారిలో ఫిరంగి నాలాను ఆనుకుని పదుల సంఖ్యలో డబ్బాలను ఏర్పాటు చేసి అద్దెకిచ్చేస్తున్నారు. దీనిపై ఇంతవరకు మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణ కారణంగా సాధారణ ప్రజలతో పాటు ప్రయాణికులు సైతం నిత్యం నరకం చూస్తున్నారు. జనాభా రద్దీలేని సాతంరాయిలో పెద్దసార్ల ఆదేశాలతో ఆగమేఘాల మీద ఆక్రమణ తొలగింపులు చేసిన అధికారులు అదే రీతిన పట్టణంలో ఉన్న ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



రాళ్లగూడ రహదారిలో ఫిరంగి నాలాను ఆనుకుని వేసిన డబ్బాలు



రాళ్లగూడ రహదారిలో ఫుట్‌పాత్‌పై దందా

ఆక్రమణలను తొలగిస్తాం..

పట్టణంలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని ఉన్న కట్టడాలు, డబ్బాలను తప్పకుండా తొలగిస్తాం. రహదారులను ఆక్రమించి ఉంటే కఠినంగా చర్యలు తీసుకుంటాం. ఆక్రమణలు ఎవరివైనా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.
– సుమన్‌రావు, శంషాబాద్ మున్సిపల్ కమిషనర్